క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నారాయణపేట రూరల్: చిన్నతనం నుంచే పిల్లలకు యోగా నేర్పించడంతో జీవితకాలం ఆరోగ్యంగా ఉంటారని విశ్వమానవత సేవా సంస్థ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాస్‌చౌదరి అన్నారు. స్థానిక సిటిజన్ క్లబ్ ఆవరణలో గురువారం ఆయన చిన్నారుల యోగా శిబిరాన్ని ప్రారంభించి మట్లాడారు. ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులు పిల్లలకు క్రమశిక్షణ నేర్పించాలని, సూర్యనమస్కారాలు చేయించాలన్నారు. ఆసనాలు, ప్రాణాయామం తదితర యోగా కార్యక్రమాలకు సమయం కేటాయించాలన్నారు. స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పతాంజలి యోగా సమితి అధ్యక్షుడు సురేష్, రాజేంద్ర, వెంకటేష్, బలవీర్, యశ్వంత్, మల్లికార్జున్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువజన సంఘం మండల కార్యదర్శిగా కార్తీక్



నారాయణపేట రూరల్: యూత్ కాంగ్రెస్ పేట మండల ప్రధాన కార్యదర్శిగా జిలాల్‌పూర్ గ్రామానికి చెందిన రాంపురం కార్తీక్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు గురువారం సీవీఆర్ భవన్‌లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్ల రవీందర్‌రెడ్డి చేతులమీదుగా నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు యువత కీలకమని యువజన సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. పార్టీ లక్ష్యాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కృష్ణా: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 4న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జానయ్య తెలిపారు. గురువారం ఈ సర్వసభ్య సమావేశానికి గౌరవ సభ్యులు ఉదయం 11గంటలకు కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. అదేవిధంగా మండలంలోని అన్నిశాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేటినుంచి బీర దేవర బండారు ఉత్సవాలు



కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో శుక్రవారం నుంచి మూడురోజుల పాటు బీరదేవర బండారు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రామ ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీకాంత్, లక్ష్మణ్ తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఈ బండారు ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితోపాటు ఇతర పార్టీలకు చెందిన నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.

కార్మికుల హక్కులకోసం పోరాడుదాం



దామరగిద్ద: కార్మికుల హక్కులకోసం పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. మేడే ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని ఉద్మల్‌గిద్దలో సీపీఎం గ్రామ కార్యదర్శి ప్రకాష్ ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ హయాంలో నిరుద్యోగం అధికధరలు, దేశాన్ని పట్టి పీడిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు భీంషప్ప, డీఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, కేవీపీఎస్ జిల్లా సభ్యుడు మల్లేష్, సీపీఎం నాయకులు కాశప్ప, గోపాల్, ఊషప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మామిడితోటకు నిప్పు

ఆత్మకూర్: మామిడితోటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకున్న ఘటన మండలంలోని ఆరేపల్లిలో గురువారం చోటుచేసుకుంది. రైతు కావలి దేవన్నకు చెందిన మామిడితోటలో సాయంత్రం అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో గమనించిన రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మంటల్లో కాపు కాసిన 20కి పైగా మామిడిచెట్లు కాలిపోయినట్లు రైతు తెలిపారు. దీంతో సుమారు రూ.3లక్షలు నష్టం వాటిల్లిందని వాపోయాడు.

ఉపాధి పనులకు ఆదరణ

- మండలంలో ప్రతిరోజు 3 వేల మంది కూలీలు హాజరు
- సేద తీరేందుకు టెంట్లు.. అందుబాటులో తాగునీరు, ఓఆర్‌ఎస్ పాకెట్లు
- మొత్తం 12,388 జాబ్ కార్డులు.. పెరుగుతున్న కూలీలు



కంసాన్‌పల్లి చెరువులో పూడిక తీత పనులు చేపడుతున్న కూలీలు

దామరగిద్ద: రైతులు, రైతు కూలీలకు వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధికోసం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేసేందుకు వెళ్తున్నారు. వేసవి ఎండల తీవ్రతతో అవసరానికి తప్ప బయటికి వెళ్లొద్దని అధికారులు ప్రజలను హెచ్చరిస్తున్న ఉపాధికోసం కూలీలు పనులకు వెళ్లడం తప్పడంలేదు. పెరుగుతున్న వేసవి ఎండలతో బానుడి భగ భగల మధ్య ఉపాధి దగదగలాడుతుంది. మండలంలో మొత్తం 12388 కుటుంబాలు జాబ్‌కార్డులు కల్గి ఉన్నారు. వీరిలో ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న జాబ్‌కార్డులు కల్గినవారు 8వేలకు పైగా ఉన్నారు. ప్రస్తుతం రోజుకు మూడువేల మందికి పైగా వివిధ ఉపాధి పనులకు వెళ్తూ ఉపాధిపొందుతున్నారు. ప్రభుత్వం పథకం అమలులో గతంలో వేసవిలో ఉపాధికూలీతోపాటు అలవెన్స్‌లను అదనంగా ఇచ్చేది. కాగా ప్రస్తుతం ప్రత్యేక అలవెన్స్‌లను తొలగించి ఉపాధి కూలీతోపాటుగా కలిపి రోజు కూలిని రూ. 300కు పెంచారు.

ప్రత్యేక టెంట్లు



దామరగిద్ద పనిప్రదేశంలో షేర్‌నెట్‌తో నీడ

ఈజీఎస్ ద్వారా ప్రభుత్వం కూలీలు వేసవి ఎండల నుంచి సేదతీరేందుకు టెంట్లు వేసవికునేందుకు టార్పాలిన్‌ను శ్రమశక్తి సంఘానికి ఒకటి చొప్పున ఇచ్చేవారు. ప్రస్తుతం శ్రమశక్తి సంఘాల విధానం తొలగించి ఉపాధి కల్పించడంతో 20నుంచి 30మందికి పైగా ఒకేచోట పని కల్పిస్తున్నారు. పని ప్రదేశాల్లో గ్రామ పంచాయతీ ద్వారా టెంట్‌లు, తాగునీరు, ప్రథమ చికిత్స బాక్స్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వంటి వాటిని సమకుర్చుతున్నారు. పని ప్రదేశాల్లో వేసవి ఎండల రక్షణకు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ ద్వారా టెంట్లు, తాగునీరు తదితర కనీస సదుపాయాలు పొందాలని అధికారులు తెలియజేస్తున్నారు.

ఎండలు మండుతున్నాయి.



ఉదయం 7గంటల నుంచి పనికి వెళ్తే మధ్యాహ్నం 12గంటల వరకు ఉపాధి పని చేయాల్సి వస్తుంది. 10గంటల నుంచి ఎండ తీవ్రత పెరిగి పనిచేసేందుకు ఇబ్బంది పడుతున్నాం. ఉపాధికోసం ఎండలను తట్టుకొని పనిచేయాల్సి వస్తుంది. అధికారులు వేసవి కాలంలో కూలీలకు సౌకర్యం కల్పించాలి.

– వెంకటప్ప, ఉపాధి కూలీ, దామరగిద్ద

సదుపాయాలు కల్పిస్తున్నాం..



మండలంలోని వివిధ గ్రామాల్లోని ఉపాధి కల్పించేందుకు ఆయా గ్రామాల్లో ఫాం పాండ్స్, ఫీడర్ చానల్స్, చెరువుల పూడిక తీత, కందకాలు, వాలు కట్టల నిర్మాణం వంటి వ్యవసాయ అనుబంధ పనులు కొనసాగుతున్నాయి. వేసవి ఎండల తీవ్రత కారణంగా పని ప్రదేశాల్లో టెంట్లు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీధర్, ఎంపీడీఓ, దామరగిద్ద

ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం



మరికల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



మాగనూర్‌లో..

మరికల్: మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని గురువారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఉపాధికూలీల వద్దకు వెళ్లి బీజేపీకి ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు, పేదలకు న్యాయం చేసేంది ఒక బీజేపీ ప్రభుత్వమేన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, వేణు, రమేష్, నిఖిల్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల్లో బీజేపీ ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేసింది. మండల బీజేపీ అధ్యక్షుడు సత్తి సత్యనారాయణ సమక్షంలో కార్యకర్తలు బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాణిక్, వీరప్ప, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లి, కొండాపూర్ గ్రామాల్లో నేడు పాలమూరు బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే. అరుణ సమావేశం ఉంటుందని, ఇందులో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కిషన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోవర్ధన్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీని నమ్మేస్థితిలో ప్రజలు లేరని పది సంవత్సరాలు పాలించిన తెలంగాణ అభివృద్ధి చేయకుండా వారి కుటుంబాలను అభివృద్ధి చేసుకున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో డీకే అరుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, రాష్ట్ర నాయకులు రాంచంద్రయ్య, ఉమేష్, మండల అధ్యక్షుడు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని బీజేపీ నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఉదయం సాయంత్రం సమయాల్లో ఇంటింటికి తిరిగి బీజేపీకి ఓటువేయాలని ప్రజలను కోరుతున్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి, మాగనూర్, ఓబ్లాపూర్ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ తెలిపారు. అభివృద్ధికి అండగా నిలబడాలని, ఎంపీగా డీకే అరుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బాలప్ప(ఫైల్)

మరికల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తీలేర్‌కు చెందిన ఆవుల జోగుబాలప్ప (52) బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. గతనెల 27న మరికల్ నుంచి తీలేర్‌కు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. జిల్లా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు.

మాదిగలకు కాంగ్రెస్ వ్యతిరేకం



నారాయణపేట: తెలంగాణలో కాంగ్రెస్ మాదిగలకు వ్యతిరేకమని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, జిల్లా సమన్వయ కర్త ఈ. రాజు, ఉమ్మడి జిల్లా సమన్వయ కర్త బాలరాజు అన్నారు. గురువారం ఎస్సీ వాడలోని కమ్యూనిటీ హాల్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాదిగలకు న్యాయం చేకూర్చే ఉషా మెహ్రా కమిటీ నివేదికను తొక్కి పెట్టిందని దాంతో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. లోకసభ ఎన్నికల్లో మాదిగలకు సీట్లు కేటాయించకుండా కుట్ర చేశారని ఆరోపించారు. నర్సింహ, రాములు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం




మక్తల్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

మక్తల్: మండలంలోని కాంగ్రెస్ నాయకులు ప్రచారం జోరుగా కొనసాగుతుంది. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, ఆంజనేయులుగౌడ్, చంద్రకాంత్‌రెడ్డి, సుభాష్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర పార్టీ నాయకులు కుర్వ రఘు అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకోసం చేపట్టాల్సిన పథకాలని వివరిస్తూ ప్రచారం చేశారు. అలాగే మండలంలోని అప్పంపల్లి, తీలేర్, ఎలిగండ్ల, పస్పుల కన్మనూర్ తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. రఘు, కాట్టప్ప, మల్లేష్, రాములు, శ్రీను పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్‌నాయకులు ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం సాగిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో అభివృద్ధి ఖాయమని అన్నారు. ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిక..



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కుంభం శివకుమార్‌రెడ్డి

నారాయణపేట: మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున మండల అధ్యక్షుడు సదాశివరెడ్డి నేతృత్వంలో గురువారం సీవీఆర్ భవన్‌లో మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ చేరడంతో వారికి కండువాలను కప్పి స్వాగతించారు. అదేవిధంగా ధన్వాడ మండలం హనుమాన్‌పల్లికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ మల్లప్ప, మాజీ సర్పంచ్ కాలప్ప కాంగ్రెస్‌లో చేరడంతో వారికి శివన్న కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ధన్వాడ మండలం కొండాపూర్‌కు చెందిన చిన్న వెంకటయ్య (ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు), జంగ ఆంజనేయులు (ఫిషరీస్ విభాగం అధ్యక్షుడు, కోయిల్‌సాగర్ గ్రామానికి చెందిన 30మంది బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ మహ్మద్ సలీం ఆధ్వర్యంలో 19వ వార్డుకి చెందిన సర్ఫరాజ్ హుస్సేన్ అన్సారీ సీవీఆర్ భవన్‌లో శివన్న సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

పతి కోసం సతీమణి విస్తృత ప్రచారం



పేటలో ప్రచారంలో పాల్గొన్న గీతారెడ్డి

నారాయణపేట: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మరోసారి కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఆయన సతీమణి గీతారెడ్డి గురువారం పట్టణంలో ఇంటింటా విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఆమెతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ గందే అనసూయ, కౌన్సిలర్ అమ్మపల్లి శిరీష, నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.

తండాల్లో ఎక్సైజ్ పోలీసుల దాడులు



నారాయణపేట: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పలు తాండాల్లో గురువారం ఎక్సైజ్‌శాఖ, పోలీసులు దాడులు నిర్వహించి ఆరు లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకొని 2200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాలతో స్థానిక ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, మరికల్ పోలీస్ సీఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని బండతాండ, బుడ్డగాని తాండ, గాజులయ్యతాండ, నర్వ మండంలోని జంగంరెడ్డిపల్లి తాండల్లో దాడులు చేశారు. ఈ దాడుల్లో ఆరు లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకొని 2,200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్‌చేసి విచారణ చేపట్టిన సదరు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ వీరారెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్‌ఐ గురువయ్య, రమేష్, సునీత, ఎస్‌ఐలు మురళీ, కుర్మయ్య, రమేశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మక్తల్: మండలంలోని తాళంకేరి గ్రామానికి చెందిన నర్సింహులు అనుమతి లేకుండా మక్తల్ నుంచి మద్యాన్ని బైక్‌పై తీసుకెళ్తుండా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి 31200 లీటర్లు మద్యాన్ని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దాని విలువ దాదాపు రూ. 7680 ఉంటుందన్నారు. వారిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

వరి క్వింటా @ రూ.2,609

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సోనాధాన్యం క్వింటా గరిష్టంగా రూ. 2,609, కనిష్టంగా రూ. 1,350 ధర పలికింది. హంసధాన్యం గరిష్టంగా రూ. 2,001, కనిష్టంగా రూ. 1,876 ధరలు రాగా.. జొన్నలు గరిష్టంగా రూ. 4,755, కనిష్టంగా రూ. 4,565 ధరలు వచ్చాయి.

ఉత్సాహంగా సాంస్కృతిక పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్

నారాయణపేట రూరల్: పట్టణంలోని సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం వివిధ రకాలైన సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను ఏర్పాటు చేశారు. చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధి కారకాలు, నివారణ చర్యలపై వక్తలు ఉపన్యసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగారెడ్డి, క్లబ్ కన్వీనర్ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ రఫీక్ అహ్మద్, అధ్యాపకులు వెంకటయ్య, అహ్మద్‌హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: ప్రభుత్వం కల్పించే సదుపాయాలతో మైనార్టీ గురుకుల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంపై కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యార్థులను అభినందించారు. గురువారం తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో పదోతరగతి, ఇంటర్ చదివిన విద్యార్థులు పరీక్షలలో వందశాతం ఫలితాలు సాధించడంతో విద్యార్థులు కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు శాలువాతో బహుకరించి అభినందించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ అధికారి ఎంఏ రషీద్, ప్రిన్సిపాల్ ఖాజా మహబూబ్ ఖాన్, రీజనల్ కో ఆర్డినేటర్ ఖాజా, విజిలెన్స్ అధికారి జమీర్‌ఖాన్, కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాలకేంద్రంలో విద్యార్థులను సన్మానిస్తున్న డీఈఓ

నారాయణపేట రూరల్: బాలకేంద్రంలో కళలపై శిక్షణ పొంది పదోతరగతి పరీక్షల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులను గురువారం డీఈఓ ఎండీ అబ్దుల్ ఘనీ అభినందించారు. పట్టణానికి చెందిన ఉజ్వల్ చిత్రలేఖనం, అక్షయ సితార్‌లో, జిలాల్‌పూర్‌కు చెందిన ప్రసన్న చిత్రలేఖనంలో శిక్షణ పొందారు. ఇటీవల జరిగిన పదిఫలితాల్లో చక్కటి జీపీఏతో ఉత్తీర్ణత సాధించడంపై అభినందిస్తూ శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ మేరకు.. మాట్లాడుతూ.. చదువుతోపాటు కళలలో ప్రావీణ్యం సంపాదించాలని, అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను అటువైపు ప్రోత్సహించాలన్నారు. బాలకేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, సంగ నర్సింహులు, ప్రిన్సిపాల్ రాజేష్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.



కృష్ణాలో..

కృష్ణా: విద్యార్థులకు అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందించి వారిని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషిచేస్తానని ఎస్‌ఐ ఎండీ నవీద్ అన్నారు. మండలంలో పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మండల టాపర్లుగా నిలిచిన పావని, రేణుకలను గురువారం ఆయన శాలువాతో సన్మానించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు ఉన్నతంగా చదివి గ్రామానికి పాఠశాలకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని తెలిపారు.

మాగనూర్: మండల పరిధిలోని కొల్పూర్ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను వారిని మహాత్మజ్యోతిబాపూలే కమిటీ ఆధ్వర్యంలో గురువారం గ్రామ పంచాయతీ ఆవరణలో సన్మానం నిర్వహించారు. ఈ మేరకు.. కమిటీ నాయకులు కేవీ. నర్సింహ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతగా చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తెవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తాయప్ప, కుర్మయ్య, రాజు, నరసింహ, మహాదేవ్, రాకేష్, నరేష్, నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సంస్థ కో-ఆర్డినేటర్ నర్సింహులు

మక్తల్: బాలల హక్కులు, వారికి ప్రభుత్వాలు కల్పిస్తున్న చట్టాలపై ఉపాధి కూలీలకు సంస్థ కో-ఆర్డినేటర్ నర్సింహులు మండలంలోని సంగంబండలో అవగాహన కల్పించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ అనాధలైన బాలలకు, పిల్లలను పోషించలేని పరిస్థితిలో ఉన్న వారు పిల్లలను తమకు అప్పగిస్తే వారికి అన్ని రకాలుగా అర్హత ఉన్న పిల్లలు లేని తల్లిదండ్రులకు చట్ట ప్రకారం దత్తత ఇస్తామని తెలిపారు. అలాగే బాల్యవివాహాలు చేసుకోవడంతో వచ్చే అనార్థలను వివరించారు. బాలలహక్కులు, వారికి కల్పిస్తున్న చట్టాల గురించి తెలియజేశారు. విద్యకు దూరమైన బాలలకు మంచి విద్యను అందించడానికి సహాయం చేపడుతామని తెలిపారు. బాలలకు ఏ అవసరం వచ్చిన 1098 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయ్‌కుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.